## పదినాల్గవ పాఠం

## الدرس الرابع عشر

### షిర్క్ (బహుదైవారాధన), దాని రకాలు

### الشرك وأنواعه

షిర్క్ అంటే: మనిషి అల్లాహ్ యొక్క రుబూబియత్ లో, లేదా ఉలూహియత్ లో లేదా అస్మా వ సిఫాత్ లో ఇతరులను భాగస్వామి చేయుట.

షిర్క్ రెండు రకాలు: పెద్ద షిర్క్, చిన్న షిర్క్.

మొదటిది: పెద్ద షిర్క్: ఆరాధన యొక్క ఏ ఒక్క రకమైనా అల్లాహ్ యేతరుల కొరకు చేయుట పెద్ద షిర్క్ అవుతుంది. ఈ షిర్క్ చేసిన వ్యక్తి తౌబా చేయకుండా (పశ్చత్తాప పడి, క్షమాభిక్ష కోరకుండా) చనిపోతే శాశ్వతంగా నరకంలో ఉంటాడు. ఇంకా ఇది సర్వ సత్కార్యాలను నాశనం చేసేస్తుంది. అంటే ప్రళయదినాన సత్ఫలితం లభించదు. అల్లాహ్ ఆదేశం చదవండిః **{ఒకవేళ వారు షిర్క్ చేసి ఉండినట్లయితే, వారు చేసిన సమస్తం నాశనం అయివుండేది}**. (సూరె అన్ఆమ్ 6: 88).

పెద్ద షిర్క్ను అల్లాహ్ స్వచ్ఛమైన తౌబా చేయనిదే క్షమించడు. చదవండి ఖుర్ఆన్ సాక్ష్యం:

**{అల్లాహ్ క్షమించనిది కేవలం షిర్క్ మాత్రమే. అది తప్ప ఏ పాపాన్ని అయినా ఆయన తాను ఇష్టపడిన వారి కొరకు క్షమిస్తాడు. ఇతరులను అల్లాహ్ కు భాగస్వాములుగా చేసేవాడు, వాస్తవానికి మహా పాపం చేసినవాడు}**. (సూరె నిసా 4: 48).

పెద్ద షిర్క్ లోని కొన్ని రకాలు: అల్లాహ్ యేతరులతో దుఆ, అల్లాహ్ యేతరుల కొరకు మొక్కుబడి, జిబహ్ వగైరాలు చేయుట. అల్లాహ్ తో ఇతరుల్ని సాటి కలిపి అల్లాహ్ పట్ల ఉండవలసిన ప్రేమ వారి పట్ల ఉంచుట.

**{కొందరు అల్లాహ్ ను కాదని ఇతరులను ఆయనకు సమానులుగా, ప్రత్యర్థులుగా భావిస్తారు. వారు అల్లాహ్ పట్ల కలిగి ఉండవలసిన ప్రేమతో వారిని ప్రేమిస్తారు}**. (సూరె బఖర 2: 165).

రెండవదిః చిన్న షిర్క్: అంటే: ఖుర్ఆను, హదీసులో ఏ పనుల కొరకు షిర్క్ అనే పేరు వచ్చిందో కాని అవి పెద్ద షిర్క్ వరకు చేరవో వాటినే చిన్న షిర్క్ అంటారు. ఈ రకం ధర్మభ్రష్టతకు కారణం కాదు. కానీ దీని వల్ల తౌహీదులో మాత్రం కళంకం, కొరత ఏర్పడుతుంది. ఉదా: ప్రదర్శనాబుద్ధితో ఏదైనా సత్కార్యం చేయుట. లేదా పెద్ద షిర్క్ కు తోడ్పడే ఏదైనా కార్యం. ఉదా: అల్లాహ్ కొరకు చేసే నమాజు ఏదైనా సమాధి వద్ద చేయుట. అల్లాహ్ యేతరులు లాభనష్టానికి అధికారులు కారని నమ్మి కూడా వారి మీద ప్రమాణం చేయుట. ఇంకా అల్లాహ్ మరియు ఫలాన వ్యక్తి తలచినట్లు అని పలుకుట. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పారుః "మీ పట్ల నాకు అధికంగా భయం కలిగించేదేమిటంటే మీరు చిన్న షిర్క్ కు పాల్పడతారని". చిన్న షిర్క్ అంటేమిటి? ప్రవక్తా అని అడిగారు అక్కడున్నవారు. అప్పుడు ప్రవక్త చెప్పారు: "ప్రదర్శనాబుద్ధి" అని. (ముస్నద్ అహ్మద్. దీని సనద్ ప్రమాణికమైనది). మరో హదీసులో ఉంది: "ఎవరైనా అల్లాహ్ తప్ప ఏదాని ప్రమాణం చేసినా అతడు షిర్క్ చేసినట్లు". (అబూ దావూద్ 2829).

తాయత్తులు వేసుకొనుట. రోగాలు, ఆపదలు రాకుండా లేదా వచ్చినా తొలిగిపోవుటకు కడియాలు, రింగులు సాధనం అని వేసుకొనుట లాంటి పనులు చిన్న షిర్క్ కు సంబంధించినవే. ఇక అవి సాధనమే కాదు, అందులో లాభనష్టాలు ఉన్నాయి, అంటే అవి వేసుకున్నప్పుడు లాభం ఉంటుంది వేసుకోకుంటే నష్టం ఉంటుంది అని విశ్వసిస్తే అది పెద్ద షిర్కులో వస్తుంది. (అందుకు చాలా జాగ్రత్తగా ఉండాలి).